# ట్రాఫిక్ కానిస్టేబుల్

ఆరోజు ఆదివారం. ఆదివారమంటే సండే. ఆరోజు నిజమైన సన్నీ డే. చలికాలపు ఉదయం ఎండ ఎంతో సుఖంగా వుంది. ఇది ఏ మాసం? డిసెంబర్ -- అంటే ఇంగ్లీషు క్యాలెండర్‌లో చివరి నెల.

ఆ మారుతీ వ్యాన్ బాలాజీది కాదు. బాలాజీ ఆ మారుతీవాడు కాదు. శ్వేతవర్ణములో వున్న ఆ మారుతీ అసలు ఓనరు హరిరామ్ సేఠ్. అతనికి మూడుకార్లు వుండడంవల్ల అతనికి, భార్యకి, కాలేజీ, జూనియర్ కాలేజీలలో చదివే ఇద్దరు కూతుళ్లకు ఎంత ప్రయోజనకరంగా వుంటుందో దానికంటే ఎక్కువగా వాటి సారథులకు ఉపయోగపడతాయి అని చెబితే, ఆ పరిమిత కుటుంబం అంటే సంతుష్ట కుటుంబ సభ్యులు నమ్మకపోవచ్చు. అలాంటి నమ్మకమును ఆధారం చేసుకొని ఆ శకటానికి కొద్దిగా రిపేర్లు కావాలని సేఠ్‌తో చెప్పి బాలాజీ, సికింద్రాబాదులో గాంధీ బొమ్మకు క్లాక్‌టవర్ పోలీస్ స్టేషన్‌కు మధ్యలో కారు పార్క్ చేసి, ప్రక్కన సందులో ఏవో చిల్లర సామానులు కొనుక్కోవటానికి వెళ్లాడు. ఆదివారం కావటం మూలాన దుకాణాలన్నీ మూసి వున్నాయి. ఆ సందులో ఏదైనా చిన్న షాపులు తెరిచి వుంటాయని అతను అనుకున్నాడు. ఉదయం పదిగంటలు కావడంవల్ల, రహస్యంగా తెరిచే కొన్ని షాపులకు తెరవడానికి సమయం అయింది. కాని, ఆ సందులో అటు చివరకు వెళ్లి చూసినా, కనీసం ఒక్క దుకాణం కూడా అనావరణము కాలేదు. అతనికి పెద్ద నిరాశ ఏమీ కలుగలేదు. కారణము ఏమిటంటే - అది సేఠ్‌గారి కారు-సేఠ్‌గారి పెట్రోలు. కుడికాలుతో ఒక్క తన్ను తంతే చాలు, ఆ వాహనం ట్యాంక్‌బండ్ దాటి నాంపల్లి మార్కెట్‌కు గాని, మోజంజాహీ మార్కెట్‌కు గాని పరుగెడుతుంది.

తిరిగి ఆ శకటం దగ్గరకు చేరేటప్పుడు, దాని దగ్గర నిధికి కాపలా కాసే ఒక పాము మాదిరి, ఒక రాణీపాల్ అడ్వర్‌టైజ్ చేసేవాడు నిలబడి వున్నాడని కొద్ది దూరంనుంచే బాలాజీ తెలుసుకున్నాడు. ''ఛీఛీ, సంగతి గడబిడ అయిందే'' అని అనుకున్నాడు. ఈ ట్రాఫిక్ పోలీసువాళ్లు, కనీసం ఈ వంచి ఆదివారం రోజైనా వాళ్ల ఇళ్లల్లో విశ్రమించకూడదా? ఈ రోడ్డులో, ఈరోజు, ఈ సమయంలో పెద్ద ట్రాఫిక్ లేదు కదా అనుకుని, కొంచెం సేపువరకు అక్కడ కారు ఆపి ఆ సందులోకెళ్లాడు. ఆ సైడులో పార్క్ చేయకూడదని అతనికి బాగా తెలుసుకాని, ఆ కొంచెం సేపట్లోనే, ఇలాంటి ఒక దరిద్రవాసి వచ్చి పడతాడని అతను స్వప్నంలో కూడా అనుకోలేదు. ఇతను, ఆదివారం ఉదయం టీ.వీలో వచ్చే మంచి ప్రోగ్రాములు చూస్తూ వుండకూడదా?

పెదవుల మధ్య ఒక సిగరెట్ తగిలించుకొని, తనకు ఏం జరగలేనట్లు నటిస్తూ, అతను ఆ ట్రాఫిక్ కానిస్టేబుల్ దగ్గరకు వెళ్లాడు. ''గుడ్ మార్నింగ్ సర్'' అని సగము అభివాదనము చేయగానే ఆ పోలీసువాడు ఒక్క ఎగురు ఎగిరి కరిచాడు, ''ఈ కారు నీదేనా?'' అని. ''ఏం సార్ నన్ను ఆట పట్టిస్తున్నారా? ఈ బీదవాడికి ప్రస్తుతం ఒక్క మోపెడ్ మాత్రం వుంది. కాని నాకు కూడా మంచి రోజులు వస్తాయి. అప్పుడు నేను ఇలాంటి కారు ఒకటి కొంటాను. కాని నేను ఇలాగా రాంగ్ సైడులో మాత్రం పార్క్ చేయను'' అని బాలాజీ ఆ పోలీసు వాడికి నచ్చేటట్టు తమాషాగా చెప్పాడు. ''ఏందీ? పోలీసువాళ్లు నీకు శత్రువులా? నువు ఒక కారు కొనగలిగినప్పుడు, ఎప్పుడైనా రాంగ్ పార్కింగ్ చేసి, పోలీసువాడికి, నాలుగు పైసలు ఇవ్వడం అంత కష్టమా?'' అని కొంచెం అయిష్టంగానే అడిగాడు. ''మీరు చెప్పేది ఒక విధంగా కర్టెక్ట్. మీరు సిగరెట్ కాలుస్తారా?''

''ఫ్రీగా దొరికితే కాలుస్తాను. డబ్బిచ్చి కరిచే కుక్కను కొనే అలవాటు నాకు లేదు'' అని చెబుతూ సిగరెట్ తీసుకొని నోట్లో పెట్టగానే, బాలాజీ ''అగ్నీ సమర్పయామి'' అనే ప్రోగ్రాం కూడా నిర్వహించాడు. కొద్దిగా పొగ బయటకు వదిలింతర్వాత ''ఈ కారు డ్రైవరు వెధవ ఎక్కడపోయి చచ్చాడో'' అని అసహనంగా, తన వాక్యాన్ని పొగలో కప్పి స్వగతం చేశాడు; ఆ ధవళాంబరుడు.

''అతను వచ్చేవఱకు మీరెందుకు కాపలా కాయాలి సర్? ఈ కారు నెంబరు నోట్ చేసుకొని వెళ్లొచ్చు గదా. తరువాత ఒక నోటీసు పోస్టులో పంపిస్తే, ఈ కారు ఓనరేకాదు, వాడబ్బకూడా పరుగెత్తుకొస్తాడు కదా?''

పోలీసు వాడికి ఉపదేశం అంతగా నచ్చలేదు. ''నీ పేరేంట్రా?''

''బాలాజీ''

''ఒరే బాలాజీ, నీకీ పోలీసోళ్ల బాధలేం తెలువదు. ఈ కారు నెంబరు రాసుకుంటే మాత్రం, దీని ఓనర్ పేరు కనుక్కోడానికి ఆర్.టి.ఓ. ఆఫీసుకు వెళ్లాలి. అక్కడ ఎన్నివేల కార్ల అడ్రసులు వెతికితే అతను దొరుకుతాడు? అంత కష్టపడి మేము వెతికి పట్టుకుంటే, అతను వచ్చి నాలుగువందలో, ఐదు వందలో సులువుగా ఇచ్చి వెళ్లిపోతాడు. రెండు లక్షలు పెట్టి కారు కొన్నవాడికి ఈ ఐదువందలు లేక వెయ్యి బొచ్చుతో సమానము. కాని అతను గవర్నమెంటుకు అలాంటి చందా ఇస్తే మాత్రం, పోలీసు వాళ్లకు ఏం లాభం? ఇక్కడ కారు ఇలా తప్పుగా పెట్టిపోవడం నేరమే. ఏదో తెలివి తక్కువవాడు, ఈ ఆదివారం ఉదయం, ఈ దరిద్రం బండిని ఇక్కడ వదిలేసి ఎక్కడికోపోయాడు. కాని పాపం అతను అనుకునేదేమిటి? ఆదివారం ఉదయం అందరూ ఇంట్లో కూర్చుని టీ.వీలు చూడడంవల్ల రోడ్డులో ఎక్కువగా ట్రాఫిక్ వుండదని. అది గాకుంటే, షాపులన్నీ మూసి వుంటాయనీ. అతను అనుకున్నా కర్టెక్టే. కాని ఆదివారం ఉదయం ట్రాఫిక్‌వాళ్లు కూడా ఇంట్లో కూర్చుని టీ.వీ. చూడాలనే రూల్ ఏమైనా వుందా? అలాంటి విశ్రాంతి తీసుకొనే అదృష్టం మాకుందా? ప్రతిరోజు ఈ వేషం వేసుకొని బయటకు రాకపోతే మా కుటుంబాలకు నిత్యాన్నదానము చేయడానికి ఇక్కడ తిరుమల దేవస్థానము ఏమైనా వుందా? అందుకే మేము స్వంతకాళ్లపై నిలబడడం కాకుంటే, కొద్దిగా అటూ ఇటూ తిరిగితే దాని ప్రయోజనం కూడా మాకు లభిస్తుంది.''

ఆ మంచివాడైన పోలీసువాడి వదనంలో ప్రసరిస్తున్న సంతృప్తికి తిలకం పెట్టినట్టు, వికసిస్తూ వచ్చిన ఒక చిరునవ్వు చూసి, బాలాజీకి కూడా నవ్వు వచ్చింది. కాని, వచ్చే ఆ నవ్వును పంటి కొనతో నొక్కిపట్టి పోలీసు వాడికి కొంచెం కారం ఎక్కించడానికి అతను అడిగాడు. ''కాని, సర్, లంచం తీసుకోవడం తప్పుకదా! ఏదైనా ఒక రోజు పట్టుబడితే?''

''ఒరే బాలాజీ నీకెవరు పెట్టారురా, ఈ దేవుడి పేరు. నీకు మామూలు కామన్‌సెన్స్ కూడా లేదే! ఈ ఎండా, గాలి, వానా, వేడి, చలి ఇవన్నీ మామూలుగా వుండే విషయాలే గదా! వానా కాలంలో పిడుగు పడడము, మెరుపు మెరవడం అంతా సహజమే. దానికి భయపడి మనుషులు వర్షాకాలం బయటకు రాకుండా వుంటారా? ఈ మధ్యన మహారాష్ట్రలో భూకంపం వచ్చి, ఎన్నో ఇళ్లు కూలిపోయి చాలామంది చచ్చిపోయారు. అయితే, ఇక్కడ కూడా భూకంపం వస్తుందని భయపడి, హైదరాబాదువాళ్లు మొత్తం ట్రాఫిక్ పోలీసు వాళ్ల మాదిరే ఎప్పుడూ రోడ్లో వచ్చి నిలబడాలా? భగవద్గీతలో ఏంచెప్పారో నీకు తెలుసా? ఎవరు చెయ్యాల్సిన పని వాళ్లే చేయాలి. తరువాత జరిగేదంతా ఆ దేవుడిపైన వదిలేయ్. తెలివిగల వాళ్లు చెప్పేది - సగం నువు చేయ్, మిగతా సగం దేవుడు చేస్తాడు.

అందుకే మేము, చేయాల్సిన కర్మములు మేమే చేయాలి. దానికి ఏ ఆదివార, సోమవారాలు అడ్డం రాకూడదు.''

బాలాజీకి ఆ పోలీసువాడి సిద్ధాంతము, దేవుడిపై విశ్వాసము బాగా నచ్చింది. ఆ కారణంవల్లనే వారి విశిష్టబాషణ శైలి ఇంకా కొంచెంసేపు విని ఆనందిద్దామనుకొని అతను మళ్లీ అడిగాడు-

''మీరు చెప్పేదంతా నిజమే. అయినా కూడా లంచం తీసుకోవడం తప్పు కాదని మీరు అనుకుంటున్నారా?''

ఆ పోలీసువాడి ముఖంలో ఒక గంభీర భావం వ్యాపించింది.

''మీరెవరూ ఈ విషయం గురించి పెద్దగా ఆలోచించకపోవడంవల్ల మీకిలాంటి అనుమానాలు వస్తున్నాయి. దీనికి లంచం అనే పేరు పెట్టింది మనుషులే. లంచం పుచ్చుకోవడం ''తప్పు'' అని చెప్పేది కూడా మనుషులే. ఈ లోకంలో లంచం ఇవ్వకుండా లేక తీసుకోకుండా ఎవరైనా బ్రతుకగలరా? లంచం తీసుకోవడం నేరం అని చెప్పే ఈ ప్రభుత్వమేగదా అందరికంటే ఎక్కువ లంచం తీసుకునేది. ఇప్పుడు ఈ విషయం చూడు. ఈ కారు డ్రైవరు ఇక్కడ ఇలాగ తప్పుగా పార్క్ చేయడంవల్ల అతణ్ణి నేను పట్టుకుని ఒక ఇరవయ్యో, ముప్పయ్యో తీసుకుంటే దానిపేరు లంచం. కాని, ఇదే నేరానికి ఫైన్ వేస్తే గవర్నమెంటుకు ఇస్తూన్న వంద రూపాయలు, నాకిచ్చే లంచం కంటే పెద్ద లంచమేగదా? కొంతమంది కూర్చొని చతుర్ముఖపారాయణం చేసేటప్పుడు మావాళ్లు వచ్చి వాళ్లపైన కేసువేస్తే, ప్రభుత్వం వారు వాళ్లనుండి ఎంత పెద్ద లంచం వసూలు చేస్తారు! మనుషులు ఏ తప్పు చేసినా కూడా దాని ప్రయోజనం మాత్రం ప్రభుత్వానికే దక్కుతుంది. ఇక్కడ మలకపేటలో గుఱ్ఱప్పందాలు జరగడం లేదా, అక్కడ ఒక్కడికైనా స్థిరంగా లాభమొస్తుందా. రోజు లాభమొచ్చేది ఈ ప్రభుత్వానికి మాత్రమే. ఈ విధంగా మనుషులు చేసే తప్పులనుంచి లాభపడేది ప్రభుత్వం మాత్రమే. అలా వుండగా, ఈ బీద ఖాకీ ప్రజానీకం, ఓ నాలుగు పైసలు తీసుకుంటే ఎవరికి పెద్ద నష్టం? వున్నవాళ్ల దగ్గర నుంచి మాత్రమే మేము తీసుకుంటాం. బీదవాళ్లను మేము పిండేయం. మాకేదైనా కొద్దిగ ఇచ్చినందువల్ల, వాడికి లాభమే వుంటుంది. లేకపోతే ప్రభుత్వానికి పదిరెట్లు ఎక్కువ కట్టాలి కదా. విషయం అక్కడికక్కడే సెటిల్‌చేస్తే పార్టీలకు లాభం, మాకు లాభం. ఏంటి? ఇప్పుడు సంగతంతా అర్థమయిందా?''

''నాకంతా అర్థమయింది సార్, కాని, పోలీసువాళ్లే ఇలా చేస్తే జనం ఏమనుకుంటారు?''

''జనం అనుకోవడానికి ఏముంది? నువ్వే కొంచెం ఆలోచించు. ఒక నేరానికి నిన్ను నేను పట్టుకున్నాను. దానికి మామూలుగా పెనాలిటీ మూడువందల రూపాయలు అవుతుంది. నేను ముప్పై రూపాయలు తీసుకొని వదిలేస్తాను. నువ్వు అందుకు సంతోషపడతావా లేక బాధపడతావా? లేదా పెద్ద దేశభక్తుడిలా ఆ మూడువందల రూపాయలు ప్రభుత్వానికి ఇవ్వడానికి సిద్ధపడతావా? కాని ఒకటి నువ్వు చెప్పేదాంట్లో కూడా కొంచెం అర్థముంది. కొంతమంది పోలీసువాళ్లు మనుషులను వెంటాడి పీడిస్తారు. కొన్ని కేసుల్లో రెండు పార్టీలదగ్గర నుంచి కూడా డబ్బు లాగుతారు. చేసి పెట్టాల్సిన పని అసలు చేయరు. మనుషులను వూరికే అలాగే తిప్పుతుంటారు. ఇదంతా డబ్బు కొరకే. అందుకే కదా మాకింత చెడ్డపేరు ఈరోజు. మర్యాద లేకుండా ప్రవర్తించడం ఎవరికైనా మంచిదికాదు. లంచం తీసుకోవడం అనే విషయంలో కూడా కొంచెం మర్యాద పాటించాలి కదా! ప్రభుత్వంలో ఇంజనీర్లు వున్నారు. వాళ్ల రేటు ఏదో పది శాతం. కాని ఈ మధ్య అదికూడా కొంచెం పెరిగింది అని విన్నాను. మంచి డాక్టరైతే, ప్రసవ వేదనలో వున్న ఒక అమ్మాయిని ముట్టుకోవాలన్నా కూడా కనీసం రెండు, మూడువేలు పుచ్చుకుంటాడు. అంత ఇచ్చుకోవడానికి శక్తిలేని బీదవాళ్లను గవర్నమెంటు ఆసుపత్రికి తరిమేస్తారు. అక్కడ అయితే మార్చురీ కూడా దగ్గర వుంది గదా! డబ్బు పెట్టకపోతే ప్రపంచంలో ఏ పని జరుగదు. అయితే నీపేరు బాలాజీ కదా? సాక్షాత్తు బాలాజీని చూడడానికి పోతే అక్కడ కూడా వుంది లంచం. లేకపోతే దేవుడిని చూడడానికి ఏమిటీ టిక్కెట్ల వ్యవహారం! ఇరవైఐదు రూపాయల టికెట్టు తీసుకుంటేనే ఐదారు గంటల్లో దర్శనం. మరింకా అర్చన ఇతర పూజలు ఏమైనా చేయించాలంటే బోలెడు డబ్బు ఖర్చు పెట్టాలి. అలా చూస్తే, ఆ వెంకటేశ్వరుడే కదా పెద్ద లంచగొండివాడు. ఆ విషయంలో ఆయన్ని తప్పుపట్టడం కూడా అనవసరం. ఎందుకంటే ఇద్దరు పెళ్లాలు వున్నవాళ్లు లంచం తీసుకోకుండా బతగ్గలరా? మామూలుగా పెద్ద పెద్ద దొంగలు --- అంటే మామూలు దొంగలు కాదు -- గవర్నమెంట్‌కు టాక్స్ ఎగ్గొట్టే పెద్దపెద్ద వ్యాపారస్థులు -- వాళ్లు దేవుడికి పది లేదా ఇరవై శాతం వఱకు ఇచ్చేస్తారు. అది గూడా నల్లడబ్బు. ఈ నల్లడబ్బంటే అదీ చాలా ఎక్కువ దేవుడి దగ్గరే కదా దొరికేది. అందుకే, నా బంగారు బాలాజీ లంచం విషయంలో దేవుడు చాలా పాతకాలం నుండే సమర్థుడు. అందుకే బాగా సంపాదించాడు. రోజు ఖర్చులకు మేమేమైనా పుచ్చుకుంటే, దానికి గవర్మెంటే కాదు సాక్షాత్తు భగవంతుడికి కూడా మమ్మల్ని విమర్శించడానికి హక్కు లేదు. ఇంకా నీకు చెప్పడానికి ఏమైనా వుందా?''

''లేదు సార్ లేదు. తమరు ఏదైనా పెద్ద వకీలుగాని లేదా లెక్చరర్‌గాని కావాల్సిన మనిషి.

తమ ప్రసంగం అతి గంభీరము. ఇది టిక్కెట్టు కొనుక్కొని వినాల్సిన ప్రసంగం. మంత్రులెవరైనా ఇదివింటే తప్పకుండా కాపీ కొడ్తారు. అందుకే తమరు ఈ విషయాలన్నీ అందరితో చెప్పొద్దండి'' అని బాలాజీ అతణ్ణి పొగిడాడు.

''ఛీఛీ, ఈ వెధవ డ్రైవరు కొఱకు నేను ఎంత సేపటి నుండి వేచి వున్నాను. అప్పుడప్పుడు ఒక టీ లోపలికి పోకపోతే ఏదోలా వుంటుంది'' అని స్వగతం మాదిరి ఆ ట్రాఫికుడు చెప్పేటప్పుడు, ''ఇదిగోండి సార్ ఒక ఐదురూపాయలు. వెళ్లి వేడివేడి టీ త్రాగిరండి. అంతవఱకు నేను ఇక్కడే వుంటాను. ఆ డ్రైవరు వెధవ వస్తే, నేను ఇక్కడే వుంచుతాను. తమరు నిదానంగా పోయి రండి.''

ఆ పచ్చ కాయితం జేబులో పెట్టుకుంటూ, ''ఏయ్, నీ ఫ్రీ డబ్బు నాకేం అక్కర లేదు. టీ త్రాగటానికి కావాల్సిన డబ్బు నా జేబులో కూడా వుంది'' అని ఆక్రోశిస్తూ ఒక దొంగ కేసులో ముద్దాయిని చూసినట్టు బాలాజీని చూశాడు.

''అయినా గూడా, ఫ్రీగా తాగే చాయ్‌లో ఒక ప్రత్యేక రుచి వుంది సార్'' అని చెబుతున్న బాలాజీతో, అభిప్రాయ భిన్నత ఏమీ లేనట్టు ఒక పులిసిన నవ్వు ప్రసాదించి పోలీసువాడు మెల్లగా టీ షాపు వైపు వెళ్లాడు.

అతడు టీ షాపు లోపలికి వెళ్లాడని నిర్ధారించుకొని, ''అయితే నేను కూడా దాదాపు ఫ్రీగానే తప్పించుకున్నాను'' అని అనుకొని నవ్వుకుంటూ మారుతిలోకి ఎక్కిన బాలాజీ, దాన్ని స్టార్ట్ చేసి, ఆక్సిలేటర్‌పై కుడికాలు పెట్టగానే ''అహల్యా మోక్షంలో'' జరిగినట్టు చలనరహితంగా వుండే ఆ దవళవాహనం జీవప్రాప్తి పొంది ట్యాంక్‌బండ్ వైపు రివ్వున దూసుకుపోయింది.

16-31 డిసెంబర్ 1993 నాటి 'పోలీస్ ఫైల్' పత్రికలో ప్రచురితం.

---